ఆదివారం 6 అక్టోబర్ 2024 5

శ్రీ సత్యసాయి



ట్రాక్టర్ బోల్తా.. ఇద్దరు యువకులు మృతి



మృతులు వన్నూరుస్వామి, లక్ష్మీకాంత్

ప్రజాశక్తి - బ్రహ్మసముద్రం

ట్రాక్టర్ బోల్తాపడి ఇద్దరు యువకులు మృతిచెందిన సంఘటన బ్రహ్మసముద్రం మండలం ముప్పులకుంట గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదానికి సంబందించిన వివరాలు... ముప్పులకుంట గ్రామానికి చెందిన వన్నూరుస్వామి, లక్ష్మీకాంత్ గొర్రెల కాపరులు. ఈ నేపథ్యంలో వీరు శనివారం ట్రాక్టర్ తీసుకుని వ్యవసాయ పొలంలో రోటవెయిటర్ చేయడానికి వెళ్లారు. పని అనంతరం ఇంటికి వస్తున్న సమయంలో వర్షంకారణంగా బురదమయంగా ఉన్న రోడ్డులో వీరి ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ కింద పడి వన్నూరుస్వామి(21), లక్ష్మీకాంత్(19) అక్కడికక్కడే మృతిచెందారు. యువకుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బిజెపి హయాంలో విద్యారంగం నిర్వీర్యం

ఎస్ఎఫ్ఐ అఖిలభారత మాజీ అధ్యక్షులు వై. వెంకటేశ్వర్లు

ఎస్ఎఫ్ఐ రాష్ట్రస్థాయి వర్క్ షాప్ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ అఖిలభారత మాజీ అధ్యక్షులు వై. వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని ఎస్ఎఫ్ఐ అఖిలభారత మాజీ అధ్యక్షులు వై. వెంకటేశ్వర్లు విమర్శించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్రస్థాయి వర్క్ షాప్ అనంతపురం నగరంలోని అంబేద్కర్ భవనంలో శనివారం ప్రారంభమైంది. శనివారం నుంచి ఈనెల 8 వ తేదీ వరకు నిర్వహించే ఈ వర్క్‌షాప్‌లో మొదటిరోజు జరిగిన కార్యక్రమంలో వై. వెంకటేశ్వర్లుతో పాటు ,మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు ప్రసన్న, అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. మొదటి రోజు సమావేశంలో భాగంగా ప్రారంభ సభలో ఎస్ఎఫ్ఐ మాజీ అఖిలభారత అధ్యక్షులు వై వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ అలుపెరగని పోరాటాలు సాగిస్తోందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యారంగాన్ని నాశనం చేయడానికి నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకువచ్చిందన్నారు. దీని వల్ల దేశంలో ప్రాథమిక విద్య పూర్తి స్థాయిలో నాశనమైందన్నారు. పలు పాఠశాలలు మూతపడ్డాయని, చాలామంది విద్యార్థులు చదువుకు దూరం అయ్యారని అన్నారు. చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగం లేకపోవటంతో నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం దురదృష్టకరమన్నారు. ఈవిధానానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలో వచ్చి 100 రోజులు పూర్తి చేసుకుందన్నారు. రాష్ట్ర విద్యా రంగం పై ప్రభుత్వం అభివృద్ధి శూన్యంగా ఉందన్నారు. ఎన్నికల సందర్భంగా అనేక హామీలు ఇచ్చిన చంద్రబాబు, నారా లోకేష్ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మరిచి పరిపాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. జూనియర్ కళాశాల మధ్యాహ్న భోజనం అంశంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలన్నారు. సంక్షేమ హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని వాటిని పునర్ నిర్మించాలని డిమాండ్ చేశారు. వార్డెన్, వంట మనిషి, వాచ్‌మెన్ పోస్టులు భర్తీ చేయాలని, ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుకూలంగా మెస్ కాస్మెటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్ విడుదల చేయాలన్నారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓతూరు పరమేష్, రామ్మోహన్, వినోద్ కుమార్, కిరణ్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు అబ్దుల్లా, రవి, వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు రజిత, అమూల్య, అనంతపురం జిల్లా అధ్యక్షులు సిద్దు, ఉపాధ్యక్షులు వైటిసి రమేష్, శివ, వంశీ, సూర్య, భీమేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

విఒఎల అక్రమ తొలగింపులు సరికాదు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్



ధర్నాలో పాల్గొన్న నాయకులు, విఒఎలు, తదితరులు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

జిల్లా వ్యాప్తంగా ఉన్న విఒఎలకు 5 నెలల బకాయి వేతనాలు చెల్లించి, రాజకీయ అక్రమ తొలగింపులు, అధికారుల వేధింపులు ఆపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలో భాగంగా సత్య సాయి జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఒఎలకు 2024 మే నెల నుండి ఉన్న బకాయి వేతనాలు చెల్లించాలన్నారు. వేతనాలకు సంబందించి అనేక సార్లు వినతి పత్రాలు ఇచ్చామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బకాయి వేతనాలు చెల్లించి ఆర్థిక ఇబ్బందుల నుండి విఒఎల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గత 2 నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా విఒఎలు అక్రమ తొలగింపులకు, వేధింపులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా వేలాది మందిని తొలగించారని మరి కొంతమందిని తొలగించడానికి లిస్టులు తయారు చేసి ఉద్యోగం నుండి తొలగి పోవాలని వేధిస్తున్నారని అన్నారు. అధికారులు, స్థానిక రాజకీయ నాయకులతో కలిసి నిబంధనలకు విరుద్ధంగా విఒఎల అక్రమ తొలగింపులకు పాల్పడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ లీగల్ గానే హైకోర్టు, సుప్రీంకోర్టుకు కూడా వెళ్లడం జరిగిందన్నారు. గ్రామ సమాఖ్య జనరల్ బాడీ నిర్వహించడం లేదని, తీర్మానము లేకుండానే కొత్త మినిట్ బుక్ లో కొంతమంది మండల అధికారులే తీర్మానం రాసి గ్రామ సంఘం లీడర్లను మండల సమాఖ్యకు పిలిచి విషయం చెప్పకుండా సంతకాలు చేయించి సొంత వారిని తొలగించి, కొత్త వారిని నియమించి పని చేయడం బాధాకరమన్నారు. అక్రమ తొలగింపులకు గురైన వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరుతున్నామన్నారు. ఈ విషయాన్ని పరిశీలించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని అనేకసార్లు పై స్థాయి అధికారులందరికీ వినతి పత్రాలు ఇచ్చామన్నారు. క్రింది స్థాయిలో నిబంధనలకు విరుద్ధంగా స్థానిక రాజకీయ నాయకులతో కలిసి అధికారులే చట్ట విరుద్ధానికి పాల్పడడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి జిల్లా కలెక్టర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జిల్లాలో తొలగించిన వందలాది మంది కార్మికులను వెంటనే విధులలో నియమించాలని డిమాండ్ చేశారు. ఈ వైఖరి ఇలాగే కొనసాగితే కూటమి ప్రభుత్వంపై మరోసారి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిఆర్‌డిఎ పీడీ నరసయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ, సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి సాకే వెంకటేష్, సిఐటియు జిల్లా నాయకులు బ్యాల్ల అంజి, అధ్యక్షులు హనుమంత రాయుడు, జిల్లా నాయకులు శివరాం రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడుదాం : సిపిఎం



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జెడ్పీ శ్రీనివాసులు

ప్రజాశక్తి-హిందూపురం

కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాటాలు సాగిద్దామని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జెడ్పీ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం హిందూపురంలో కుల వివక్ష పోరాట సంఘం ఆధ్వర్యంలో సంఘం ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం కాలనీలో అన్నమయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జెడ్పీ శ్రీనివాసులు హాజరై కెవిపిఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ కులం పేరుతో అవమానపరిచే పద్ధతులతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. దేవాలయాలు, వన భోజనాలు, హోటళ్లు, షేవింగ్ షాపుల్లో కూడా వివక్ష నెలకొంటోందని అన్నారు. ఈ వివక్ష భరించలేక చాలామంది దళితులు మతమార్పిడి చేసుకుంటున్నారని అన్నారు. దేశంలో మతోన్మాద పార్టీ బిజెపి అధికారంలోకి వచ్చిన దళితులపై దాడులు అధికం అయ్యాయన్నారు. హత్యలు, అత్యాచారాలు ప్రతిరోజు ఏదో ఒకచోట జరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతూ ప్రతి దళితుడికి మూడెకరాల భూమి ఇవ్వాలని, ఇల్లు, ఇంటి స్థలం ఇవ్వాలని అన్నారు. దళితులపై దాడులు జరిగితే వెంటనే స్పందించేది కేవీపీఎస్ అని అన్నారు. భూములను లాక్కుంటే ఆ భూములను ఇప్పించేంత వరకు పోరాటం చేసి అనేకమంది పేదలకు ఇల్లు, ఇంటి స్థలాలు సాధించి పెట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు రాయుడు, యోగానంద్, రామాంజనేయులు, చౌడప్ప, గోవిందప్ప, గోపాలకృష్ణ, వెంకటేష్, నర్సింహులు, నారాయణ, ఇంటి స్థలాల పోరాట సంఘం నాయకులు నాజియా, ఆర్షియా, సరస్వతి, గంగమ్మ, ఆదిలక్ష్మమ్మ, రామాంజినమ్మ, మూర్తి, గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపుల టెండర్ ప్రక్రియ పరిశీలన

ప్రజాశక్తి-హిందూపురం

నూతన మద్యం పాలసి అమలు అవుతున్న నేపథ్యంలో మద్యం దుకాణాల కోసం ధరఖాస్తు చేసుకునే ఆశావాహులు ముందుగానే మద్యం షాపులకు దరఖాస్తులు నమోదు చేసుకోవాలని అనంతపురం ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం. శ్రీరామ్ చెప్పారు. హిందూపురం సర్కిల్ పరిధిలో 11 మద్యం దుకాణాలకు, పరిగి మండల పరిధిలో ఒక దుకాణానికి హిందూపురం ఎక్సైజ్ స్టేషన్‌లో ధరఖాస్తులను స్వీకరిస్తున్న నేపథ్యంలో ఈ ప్రక్రియను అనంతపురం ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం. శ్రీరామ్ శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రోహిబిషన్, ఎక్సైజ్ శాఖ సి ఐ ఎన్. లక్ష్మి దుర్గయ్య, ఎస్ఐలు పృథ్వీరాజ్, ఫరూక్, హెడ్ కానిస్టేబుళు సతీష్, వెంకటేష్, నరసింహ, రమణ, సిబ్బంది ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ



కోర్టు ఆవరణంలో శుభ్రం చేస్తున్న న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది

ప్రజాశక్తి-హిందూపురం

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరు బాధ్యతగా గుర్తించాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ, సీనియర్ సివిల్ జడ్జి మానిపాటి శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో "స్వచ్ఛభారత్" కార్యక్రమాన్ని నిర్వహించారు. నిత్యం కేసులు శిక్షలతో తీరిక లేకుండా ఉండే న్యాయమూర్తులు చీపుర్లు చేతబట్టి కోర్టు ఆవరణలో పరిశుభ్రత పనులు చేపట్టారు. అదే విధంగా ప్రతి న్యాయస్థానం పై కప్పు లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగింప చేశారు. అలాగే న్యాయస్థానం భవనాలపై వచ్చిన చెట్లను తొలగించాలని ఆయా పర్యవేక్షకులకు సూచించారు. అనంతరం అదనపు జిల్లా జడ్జి, సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. ముఖ్యంగా న్యాయస్థాన సిబ్బంది తాము కూర్చొనే గదిని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని తెలిపారు. విచ్చలవిడిగా ప్లాస్టిక్ ఉపయోగించడం వల్ల భవిష్యత్తులో ఎన్నో దుష్పరిణామాలు ఎదురవుతాయని పేర్కొన్నారు. స్వచ్ఛభారత్ ను కేవలం మొక్కుబడిగా కాకుండా నెలలో ఒకరోజు ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు రామచంద్రారెడ్డి, సత్యనారాయణ, సిద్దు, గోపాలకృష్ణ, రమేష్, ఆయాకోర్టుల పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ యవత ఉపాధికి చర్యలు : కలెక్టర్



గొర్రెల పెంపకం యూనిట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా పరిధిలో మీట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని కలెక్టర్ టిఎస్ చేతన్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మాంసాభివృద్ధి యూనిట్ల ఏర్పాటు, కోళ్ల పెంపకం, ద్వారా గుడ్ల ఉత్పత్తి, పాడిఆవుల ద్వారా పాల ఉత్పత్తి పెంపొందించి యువతకు ఉపాధి కల్పించే ధ్యేయంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోనుందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన పుట్టపర్తి మండల పరిధిలోని పైపల్లి గ్రామంలో గొర్రెల పెంపకం యూనిట్లను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పైపల్లి గ్రామానికి చెందిన మంజునాథ్ జాతీయ జీవనోపాధి మిషన్ ద్వారా గొర్రెల పెంపకం యూనిట్లు ఏర్పాటు చేశారు. ఈ యూనిట్ ద్వారా పొందుతున్న లబ్ధి, పెంపకంలో వచ్చే ఖర్చు తదితర అంశాలను కలెక్టర్ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా గొర్రెలు మేకలు 31 లక్షలు పైగా పెంపకం జరుగుతున్నాయని, ఇంకా పెంపకం దారులకు గొర్రెల పెంపకం యూనిట్లను మంజూరు చేసి, వాటి ద్వారా గొర్రెలను మేకలను పెంచి, జిల్లా కేంద్రంలో మాంసాన్ని తయారు చేసే యూనిట్‌ను ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాలకు మాంసాన్ని ఎగుమతి చేస్తే ఇక్కడ గొర్రెల పెంపకం దారులకు మరింత లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం రెండు యూనిట్ల ద్వారా మంజునాథ్ అతని సోదరుడు వెయ్యి గొర్రెలను పెంచుతున్నారని, ఇదే రీతిలో జిల్లాలోని ముదిగుబ్బ, నల్లమడ ,ఓడిసి, ఆమడగూరు, రామగిరి, తనకల్లు మండలాల్లో గొర్రెలను మేకలను పెంచుతున్నారని చెప్పారు. జిల్లా కేంద్రంలో ఏదో ఒకచోట మీట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే ఇక్కడ యువతకు ఉపాధి లభించడమే కాక పెంపకం దారులకు మరింత లాభాలు చేకూరుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శుభదాస్, డాక్టర్ చైతన్య, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మహిళలు చైతన్యవంతులు కావాలి

ప్రజాశక్తి-హిందూపురం

ముస్లిం మహిళలు దేశ అభివృద్ధి కోసం చైతన్య వంతులు కావాలని సిడిపిఒ రెడ్డి రమణమ్మ, డాక్టర్ షర్మిళా బేగం పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని అల్ హి లాల్ ఫంక్షన్ హాల్‌లో అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూఖ్ ఖాన్ ఆధ్వర్యంలో జామియా మసీదు కమిటీ అధ్యక్షతన ముస్లిం మహిళా చైతన్య సదస్సు జరిగింది. ఈ సదస్సుకు సిడిపిఒ రెడ్డి రమణమ్మ, ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ షర్మిళా బేగం, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, యువ న్యాయవాది నవేరా రెహ్మాన్, మహిళా కౌన్సిలర్ షాజియా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతు భారతదేశంలో ముస్లిం మహిళలు ఎల్లప్పుడూ సాధికారత, పోరాటాల చరిత్రను కలిగి ఉన్నారన్నారు. సాధికారత పొందిన మహిళలు తమ జీవితాలను మెరుగుపరుచుకోవడమే కాకుండా, వారి కుటుంబాలు–సమాజాలకు కూడా తోడ్పతున్నారన్నారు. భారతదేశ పురోగతికి ముస్లిం మహిళల సహకారం చాలా కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఖదీజా షేక్, ముఫ్తీ ఇబ్రహీం, మౌలానా అతావుల్లా, మౌలానా ఇస్మాయిల్, మౌలానా మరఘోబ్, మహిళా కౌన్సిలర్లు మాజాన్, షేక్ రేష్మా, నాసిరా బాను, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యారాలు బీబీ హాజీరా ఖాన్, న్యామతున్నిసా, నఫీసా, నాజిమా, యంగ్ ఇండియా ఫరీదా అలియాస్ (లక్ష్మమ్మ), జామియా మసీదు కమిటీ సభ్యులు ముస్తఫాతదితరులు పాల్గొన్నారు.

విస్తారంగా వర్షాలు

నిండిన కుంటలు, చెక్‌డ్యాములు



పాపసాని పల్లి వద్ద చెక్‌డ్యాం నిండి కిందికి ప్రవహిస్తున్న నీరు

ప్రజాశక్తి - మడకశిర

నియోజకవర్గ వ్యాప్తంగా గత వారం రోజుల నుండి విస్తారంగా వర్షాలు పడటంతో కుంటలు చెక్ డ్యాములు నిండి నీటితో దర్శనమిస్తున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు వేరుశనగ పంటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అయితే గత 15 రోజుల క్రితం ఈ వర్షం వచ్చినట్లయితే పూర్తి స్థాయిలో పంట చేతికి వచ్చేదని ఇప్పుడు వర్షం వచ్చినా ఎలాంటి ఉపయోగం లేదని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. కుంటలు చెక్ డ్యాములు నీటితో నిండటంతో భూగర్భజలాలు పెరిగి రబీలో పంటలు పండించుకోవడానికి అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నాలుగవ తేదీ నియోజకవర్గంలోని ఐదు మండలాలలో భారీగా వర్షం పడటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మడకశిరలో 54.4 మిల్లీమీటర్లు, అమరాపురంలో 32.4 మిల్లీమీటర్లు, గుడిబండలో 82, రొళ్లలో 29.4, అగళిలో 38 .4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. నియోజకవర్గంలోని అన్ని మండలాలలో కూడా వర్షం పడటంతో ఇప్పటికే కొన్ని చెరువుల్లోకి నీరు చేరింది. చిన్న చిన్న చెక్ డ్యాములు నిండాయి. అదేవిధంగా గ్రామాలలో ఉన్న కుంటలు కూడా నీటితో నిండి దర్శనమిస్తున్నాయి. మండల పరిధిలోని పాపసానిపల్లిలోని చెక్ డ్యాం పూర్తిగా నీటితో నిండింది.

బత్తలపల్లి మండలంలో చీనీచెట్ల నరికివేత

బాధితుడు తంబాపురం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు

కూటమిలో నెలకొన్న ఆధిపత్యపోరే కారణమా..?



నరికివేసిన చీనీచెట్లను పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి బత్తలపల్లి

పచ్చని చెట్లను నరికే విష సంస్కృతి ధర్మవరం నియోజకవర్గంలో తిరిగి పురుడు పోసుకుంటోంది. ప్రత్యర్థి ఆర్థిక మూలాలను దెబ్బ తీయాలంటే చేతికి వచ్చిన పంటలకు నష్టం చేకూర్చడం, బోరు బావులను పూడ్చివేయడమే. లక్ష్యంగా ప్రత్యర్థులు దుశ్చర్యకు పాల్పడుతున్నారు. మండలంలోని తంబాపురం గ్రామానికి చెందిన జనసేన పార్టీకి చెందిన నాయకుడు కర్రు రమణారెడ్డికి చెందిన 53 చీనీ చెట్లను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. ఈ ఘటనకు సబందించి బాధితుడు తెలిపిన వివరాల మేరకు బత్తలపల్లి మండలం తంబాపురం గ్రామానికి చెందిన కర్రు వెంకటరెడ్డి కుమారుడు రర్రు రమణారెడ్డి తనకున్న రెండు ఎకరాలలో మూడేళ్ల కిందట 370 చీనీచెట్లను సాగు చేశాడు. ఈ నేపథ్యంలో శనివారం మరో ప్రాంతంలోని పొలం వద్దకు వెళ్లి పనులు ముగించుకుని మధ్యాహ్నం చీనీ చెట్లు సాగు చేసిన పొలం వద్దకు వెళ్లాడు. తన పొలంలో చీనీచెట్లు నరికివేసిన దృశ్యాన్ని గమనించి ఇంటి వద్ద కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీనివాసులు తమ సిబ్బందితో సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. పొలంలో పర్యటించి వివరాలు సేకరించారు. తాము వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించికుంటున్నట్లు తెలిపారు తమకు ఎవరితోనూ గొడవలు లేవని, శత్రుత్వం కూడా లేదని అన్నారు. ఎవరు చేశారో? ఎందుకు చేశారో తమకు తెలియదని బాధితుడు వాపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

చౌకధాన్యపు డిపో కోసమేనా..?

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తంబాపురం గ్రామంలో చౌకధాన్యపు డిపో కోసం ఆధిపత్యపోరు నెలకొంది. గ్రామంలోని టీడీపీ, జనసేన నాయకుల మధ్య స్టోర్ డీలర్ విషయంలో పట్టింపులు కొనసాగుతున్నాయి. దీంతో ఈ పంచాయితీ కాస్తా నియోజకవర్గంలోని అధినేతల వద్దకు వెళ్లింది. చర్చలు కొలిక్కి రాకపోవడంతో ఈ నెల కూడా స్టోర్ బియ్యం విఆర్‌ఒల ఆధ్వర్యంలో పంపిణీ జరిగేలా బియాన్ని పాఠశాలలో దించాలని అధికారులు ఆదేశించారు. ఆ మేరకు శుక్రవారం ఉదయం స్టోర్ బియ్యాన్ని పాఠశాలలో నిల్వ చేశారు. అదే రోజు రాత్రికి చీనీ చెట్లు నరికి వేయడంతో తమకు స్టోర్ రాకుండా అడ్డుపడుతున్నారే కారణంతో ప్రత్యర్థులే ఈ దురాగతానికి పాల్పడి ఉంటారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదికాకుండా మూడో వ్యక్తులు రంగప్రవేశం చేసి ఉంటారా? అన్న అనుమానాన్ని పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. ఏదీ ఏమైనా పోలీసుల విచారణ వాస్తవాలు బయట పడాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

నిరుద్యోగ యువతకు మంచిరోజులు : మంత్రి

డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్ ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు మంచి రోజులు వచ్చాయని బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్‌ను శనివారం మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ 'బాబుతోనే జాబు' అనే యువత నమ్మకాన్ని నెరవేర్చే దిశగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. చంద్రబాబు సిఎంగా బాధ్యతలు చేపట్టిన రోజే 16,457 టీచర్ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ ఫైలుపై సంతకం చేశారన్నారు. అయిదేళ్లలో 25 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే సిఎం లక్ష్యన్నారు. బడుగు, బలహీన వర్గాలు, నిరుద్యోగ యువత పోటీ పరీక్షల్లో సత్తా చూపాలన్న సదుద్దేశంతో కోచింగ్ కేంద్రాలు ప్రారంభించామన్నారు. డీఎస్సీ కోచింగ్ సెంటర్‌లో ఒక్కో అభ్యర్థికి నెలకు రూ. 1500 స్టైఫండ్, రూ. 1000 పుస్తకాల కోసం అందిస్తామన్నారు. గడిచిన అయిదేళ్లలో బిసి స్టడీ సర్కిళ్ల నిర్వీర్యం కాగా చంద్రబాబు బలోపేతం చేస్తున్నారన్నారు. భవిష్యత్తులో నోటిఫికేషన్లతో సంబంధం లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఉచిత కోచింగ్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఆనంద్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారిణి జ్యోతిర్మయి, గంగాధర్, మాజీ జడ్పీటీసీలు నారాయణస్వామి, మునిమడుగు చిన్నవెంకటరాముడు, వెంకట రమణ, శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ కేశవయ్య, టిడిపి పట్టణ కన్వీనర్ శ్రీరాములు, మండల కన్వీనర్ సిద్దయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

త్వరలో పెనుకొండలో గార్మెంట్స్ పరిశ్రమ స్థాపన

గార్మెంట్స్ పరిశ్రమ ప్రతినిధులు శనివారం మంత్రి సవితను పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. మహిళలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో పెనుకొండ చుట్టుపక్కల ప్రాంతంలో గార్మెంట్స్ పరిశ్రమ స్థాపించడానికి సుముఖంగా ఉన్నట్లు వారు మంత్రికి తెలిపారు.

విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి టౌన్

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. కందికుంట నారాయణమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ ఆర్గనైజర్ నాగేష్ అధ్యక్షతన శనివారం పట్టణంలోని బాలికల జడ్పీ హైస్కూల్‌లో 'అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం' ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కందికుంట మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత డీఎస్సీ శిక్షణ తరగతుల్లో సేవలందించిన ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువా కప్పి, పూలమొక్క అందించి సన్మానించారు. కోచింగ్ లో పాలుపంచుకున్న ఉపాధ్యాయులు, సమాజ సేవకునిగా నిలిచిన



ఉత్తమ ఉపాధ్యాయురాలిని సన్మానించిన ఎమ్మెల్యే

నాగేష్‌ను ఎమ్మెల్యే అభినందించారు. ఎమ్మెల్యే కందికుంటను ఉచిత డీఎస్సీ కోచింగ్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నాగప్ప, శంకర్, గంగయ్య, చెన్నకృష్ణ, ఓబుల్‌రెడ్డి, డీఎస్సీ కోచింగ్ సిబ్బంది, శ్రీధర్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, వెంకటరమేష్, పవన్‌కుమార్, సునీల్‌కుమార్, మనోహర్, రవినాయక్, నియోజకవర్గంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

కందికుంట నారాయణమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక బాలికల జడ్పీ హైస్కూల్ ఆవరణలో బెంగళూరులోని వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించారు. శిబిరంలో దాదాపు 800 మందికి వైద్యసేవలు అందించారు. వైదేహి వైద్యశాల యాజమాన్యానికి ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. శిబిరంలో నాగేష్, టిడిపి నాయకులు వీరశంకర్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు లేని సమావేశాలెందుకు..?

మండల మీట్‌లో సభ్యుల ఆగ్రహం



మండల సమావేశంలో ప్రశ్నిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి-గాండ్లపెంట

ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులే హాజరుకాకపోతే ఇక సమావేశాలు నిర్వహించడం ఎందుకని మండల సమావేశంలో సభ్యులు ప్రశ్నించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఇన్‌ఛార్జి ఎంపిపి బి.గంగోజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి రెవెన్యూ, ఎపిఎస్ ఆర్టీసీ, హార్టికల్చర్, సిరికల్చర్, ఇరిగేషన్, అటవీ, మత్స్య శాఖల అధికారులతో పాటు కెజిబివి, తదితర శాఖల అధికారులు గైర్హాజరుకావడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కురుమామిడి సర్పంచి సుధాకర్ మాట్లాడుతూ గత ఏప్రిల్‌లో ట్యాంకర్‌తో సరఫరా చేసిన తాగునీటికి సంబంధించి రూ. 3 లక్షల బిల్లుల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా రని, దీనిపై పలుసార్లు చెప్పినా ప్రయోజనం లేదని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తానని ఆవేద వ్యక్తం చేశారు. ఎంపిడిఒ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కొన్ని శాఖల అధికారులు సెలవులో వెళ్లి అసిస్టెంట్ల ను మండల సమావేశానికి పంపుతున్నారని, ఇకపై గైర్హాజరైన అధికారులకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. సమావేశంలో ఎంఇఒ బి.కృష్ణానాయక్, పశువైద్య అధికారి బి.చెన్నకేశవనాయక్, ట్రాన్స్ కో ఏఈ ఎన్ఈ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ కిరణ్‌కుమార్‌రెడ్డి, వైద్యాధికారి మహేశ్వర్ మారుతి, ఈసీ సుబ్బారెడ్డి, ఎంపిటిసిలు జి.సోమశేఖర్‌రెడ్డి, జయరామకృష్ణారెడ్డి, పామిడి నూర్జహాన్, సర్పంచులు ఎస్.రహంతుల్లా, రవీంద్రనాయక్, శాంతమ్మ, శివప్పనాయుడు, పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు

కష్టపడిన వారికి అండగా ఉంటాం : ఎమ్మెల్యే



టిడిపిలో చేరిన సర్పంచితో ఎమ్మెల్యే రాజు, గుండుమల

ప్రజాశక్తి-అగళి

నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలను నా కళ్లలో పెట్టుకుని చూసుకుంటానని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు భరోసా ఇచ్చారు. మండలంలోని రాగేబొంగనపల్లి పంచాయతీలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని శనివారం మాజీ ఎమ్మెల్యే గుండుమల తిప్పేస్వామి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అగళి మండలం నుంచి చాలా పేద కుటుంబాలు బెంగళూరుకు వలస పోయారన్నారు. మండలంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు చెరువులను నీటితో నింపి వలస పోయిన వారు తిరిగి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం అందజేసే సంక్షేమ ఫలాలు అర్హులకు అందేలా పార్టీ శ్రేణులు పని చేయాలన్నారు. టిడిపి మండల కన్వీనర్ కుమారస్వామి కొన్ని సమస్యలను వివరించగా వాటిని పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అంతకుముందు మధూడి గ్రామంలో ఆర్‌డిటి సహకారంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, గుండుమల తిప్పేస్వామి ప్రారంభించారు. ఆర్‌జి పల్లి గ్రామంలో సచివాలయ భవనాన్ని ప్రారంభించారు.

వైసిపి సర్పంచి టిడిపిలో చేరిక

మండలంలోని ఆర్‌జి పల్లి పంచాయతీ సర్పంచిగా వైసిపి తరపున గెలుపొందిన సన్నమ్మ రంగయ్య ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమక్షంలో టిడిపిలో చేరారు. సర్పంచితో పాటు 23 మంది వైసిపి నాయకులు టిడిపిలో చేరగా వారికి ఎమ్మెల్యే రాజు, గుండుమల పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. సర్పంచి రంగయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే రాజు మూడు నెలల్లోనే పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో పాటు పేదలను అన్ని రకాలుగా ఆదుకుంటూ అండగా నిలుస్తున్నారన్నారు. ఎమ్మెల్యే రాజుతోనే పంచాయతీ అభివృద్ధి అని నమ్మి టిడిపిలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి ఉమేష్, మండల కన్వీనర్ కుమారస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ ఎస్ఐగా శ్రీరాములు యాదవ్

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్



పుట్టపర్తి పట్టణ అర్బన్ నూతన ఎస్ఐగా శనివారం శ్రీరాములుయాదవ్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు స్టేషన్ సిబ్బంది ఘనంగా సన్మానం చేసి స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ పుట్టపర్తి అర్బన్ పరిధిలో గతంలో ఎఎస్ఐగా విధులు నిర్వహించిన అనుభవం ఉందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తనను కలవవచ్చని ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగులు బాధ్యతల స్వీకరణ

కొత్తచెరువు : కొత్తచెరువు మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా శ్రీనివాసరెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కల్లూరు మేజర్ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. వార్డుల్లో సమస్యలపై పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిజిస్టర్‌లో రాసి ఫోన్ నెంబర్ వేయాలని, ఆయా సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. అలాగే గ్రామపంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా జనార్ధన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈయన ఉరవకొండ మేజర్ గ్రామపంచాయతీ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

నల్లమాడ ఎస్ఐగా దాదాపీర్



ఎస్ఐ దాదాపీర్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

నల్లమాడ : మండల నూతన ఎస్ఐగా దాదాపీర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పుట్టపర్తిలో విఆర్‌లో ఉన్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతన ఎస్ఐ మాట్లాడుతూ ఇప్పటికే మండలంలో పని చేసిన అనుభవం ఉందన్నారు. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండి పని చేశానన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకొని బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు. నూతన ఎస్ఐని టిడిపి నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మైలేశంకర్, డాక్టర్ బుట్టి నాగభూషణ నాయుడు, మహేందర్ నాయక్, మణికుమారి, అబ్బాస్‌ఖాన్, అరవింద్, మంజునాథరెడ్డి, హనుమంతరెడ్డి, గందోడు శ్రీరాములు పాల్గొన్నారు.

నూతన తహశీల్దార్‌కు సన్మానం

మడకశిర : మండల నూతన తహశీల్దార్ కరుణాకర్‌ను శనివారం దళిత హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్.హనుమంతు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. హనుమంతు మాట్లాడుతూ మండలంలో శ్మశాన వాటిక లేని గ్రామాలను గుర్తించి రెండెకరాల చొప్పున భూమి కేటాయించాలని కోరారు. అలాగే ఉపాధి అవకాశాలు లేక వలస పోతున్న కార్మికుల కుటుంబాలను గుర్తించి రెండెకరాల చొప్పున ప్రభుత్వ భూములు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వర్, మఠం లక్ష్మినారాయణ, తిప్పేస్వామి, శివపాల్గొన్నారు.

నేడు శ్రీరామిరెడ్డి జయంతి

మడకశిర రూరల్ : మండలంలోని నీలకంతాపురం గ్రామంలో ఆదివారం స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ పార్లమెంట్ సభ్యులు నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి 119వ జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన కుటుంబం సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి, సత్యవతి ఐఎఎస్, శుభకల్యాం ఐఎఎస్ హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గంలో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు, ఆట పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తారు. గంగలవాయిపాలెం, గోవిందా పురం పంచాయతీల్లోని ఉత్తమ రైతులకు బహుమతులు అందజేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కుటుంబ వ్యవస్థ మెరుగవ్వాలి

న్యాయ విజ్ఞాన సదస్సులో ఎడిజె కంపల్లె శైలజ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎడిజె కంపల్లె శైలజ

ప్రజాశక్తి-పరిగి

ప్రస్తుత సమాజంలో కుటుంబ వ్యవస్థ మెరుగుపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అదనపు జిల్లా జడ్జి(ఎడిజె) కంపల్లె శైలజ తెలిపారు. 'విధాన్ పే సమాధానం' కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కక్షలు, కార్పణ్యాల జోలికి వెళ్లకుండా ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలన్నారు. ముఖ్యంగా మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆర్థిక స్తోమత లేని వారికి ఉచిత న్యాయ సహాయం అందజేస్తామన్నారు. ప్రతి తల్లిదండ్రులు తప్పనిసరిగా పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. పిల్లలు చదువుతో పాటు సమాజ బాధ్యతలపై దృష్టి సారించేలా చూడాలన్నారు. సమాజంలో జరుగుతున్న మోసాలను గమనిస్తూ ఎప్పటికప్పుడు చైతన్యవంతులు కావాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పట్టుదలకు పోకుండా రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించు కుంటే ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. రీసోర్స్ పర్సన్, అదనపు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇందాద్ సైబర్ నేరాలు, సెల్‌ఫోన్, తదితర అంశాలపై వివరించారు. సీనియర్ న్యాయవాది కళావతి గృహహింస, బాల్య వివాహాలు, పోక్సో, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. సీనియర్ న్యాయవాది గోపాలకృష్ణ మోటార్ వెహికల్ చట్టం గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బీమా పొందాలన్నారు. అనంతరం మహిళలకు భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో తహశీల్దార్ హసీనా సుల్తానా, సిఐ రాఘవన్, ఎపిఎం రామేశ్వర్‌రెడ్డి, లోక్ అదాలత్ సిబ్బంది శారద, హేమావతి, మండల సమాఖ్య ప్రతినిధులు సిద్ధమ్మ, శశికళ, జ్యోతి, శృతి, ముత్యాలక్క, తదితరులు పాల్గొన్నారు. మండల రిసోర్స్ పర్సన్లుగా షకీల, చంద్రకళను ఎంపిక చేశారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



ప్రజాశక్తి- ధర్మవరం రూరల్

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని అటవీ శాఖ అధికారి హుసేనప్ప తెలిపారు. స్వర్ణాంధ్ర-2047లో భాగంగా చివరి రోజైన శనివారం పట్టణంలోని కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఫిజిక్స్, ఎన్ఎస్ఎస్ విభాగాలతో పాటు అటవీ శాఖ సంయుక్త సౌజన్యంతో ప్రిన్సిపల్ డాక్టర్ కె.ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన వన్యప్రాణుల వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా బుక్కపట్నం అటవీ క్షేత్రం నుంచి ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి కె.హుసేనప్ప హాజరై మాట్లాడారు. ప్రతిఒక్కరూ వన్యప్రాణులు, జంతువుల పట్ల ప్రేమ, దయతో మెలగాలని, అటవీ సంపదను సంరక్షించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా వాటికి అవసరమైన మంచి వాతావరణం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో భౌతిక శాస్త్ర విభాగం అధిపతి పావని, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి.గోపాల్ నాయక్, అటవీ శాఖ సిబ్బంది అక్కులప్ప, సునంద, పుల్లప్ప, అధ్యాపకులు త్రివేణి, చిట్టెమ్మ, షమీవులాల, కిరణ్‌కుమార్, భువనేశ్వరి, హైమావతి, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


కదిరి టౌన్ : వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా గాండ్లపెంట మండలంలోని ఆదర్శ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 'వన్యప్రాణులు-సంరక్షణ' అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ దామోదర్ మాట్లాడుతూ భూమిపై మనుషులతో సమానంగా ప్రాణం ఉన్న ప్రతి జీవికి జీవించే హక్కు ఉందన్నారు. అటువంటి వన్యప్రాణులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జంతువులను వేటాడటం చట్టరీత్యా నేరమని, అటువంటి వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు వి.కుళ్లాయప్ప, ఎస్.బ్రహ్మయ్య, అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒడిసి ఎస్ఐగా మల్లికార్జునరెడ్డి



ఓబుళదేవరచెరువు : మండల నూతన ఎస్ఐగా మల్లికార్జునరెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడున్న ఎస్ఐ ఉద్యోగోన్నతి బదిలీపై మరో చోటికి వెళ్లారు. కనగానపల్లిలో పనిచేస్తున్న మల్లికార్జునరెడ్డి బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతన ఎస్ఐ మాట్లాడుతూ మండల ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు.

వెలుగు ఎపిఎంగా రవీంద్ర



ఎపిఎం రవీంద్రను సన్మానిస్తున్న సిబ్బంది

మండల వెలుగు ఎపిఎంగా కె.రవీంద్ర బాధ్యతలు చేపట్టారు. గతంలో పని చేస్తున్న రమణప్ప జిల్లా కేంద్రానికి బదిలీ అయ్యారు. నల్లచెరువు ఎపిఎంగా పనిచేస్తున్న రవీంద్రను బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతన ఎపిఎం రవీంద్రను వెలుగు సిబ్బంది, సీసీలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

బీచిగానిపల్లిలో పంటకోత ప్రయోగం

పరిగి : మండలంలోని బీచిగానిపల్లి గ్రామానికి చెందిన పొలాల్లో శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంట కొత్త ప్రయోగాలు నిర్వహించారు. రైతు తిప్పారెడ్డి సాగు చేసిన మొక్కజొన్న పంటలో ఏవో విజయభారతి పంటకోత ప్రయోగాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎఇఒ లలిత, ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ తరపున అశోక్, నరేంద్ర, విఎస్ఎ నరేంద్ర, రైతులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

పరిగి : మండలంలోని ధనాపురం గ్రామానికి చెందిన రోడ్డలప్ప గారి మాధవి(31) పరిగి చెరువులో పడి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. మాధవి కొన్ని రోజులుగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. ఈ క్రమంలోనే రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన ఆమె చెరువులో పడినట్లు ఆమె అక్క రత్నమ్మ పోలీసులకు తెలిపింది. దీంతో పోలీసులు చెరువు వద్దకు వెళ్లి మాధవి మృతదేహాన్ని బయటకు తీయించి హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలతో పాటు ఒక కుమారుడు ఉన్నారు.

ఆశా కార్యకర్త మృతి



రామాంజనమ్మ(ఫైల్‌ఫోటో)

పరిగి : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని శాసనకోట గ్రామ ఆశా కార్యకర్త రామాంజనమ్మ (56) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందింది. ఆమె 20 ఏళ్లకు పైగా గ్రామాల్లో సేవలు అందించి నట్లు డాక్టర్ నవీన తెలిపారు. ఆమె మృతి పట్ల ఆరోగ్య శాఖలో పని చేస్తున్న తోటి కార్యకర్తలు, అధికారులు, సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె కుటుంబానికి అండగా ఉంటామని వైద్యులు తెలిపారు. డాక్టర్లు, పిహెచ్‌సి సిబ్బంది ఆమె ఇంటి వద్దకు వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు పరామర్శించారు. వైద్యాధికారులు స్వరూపరెడ్డి, డాక్టర్ నవీన, సిబ్బంది వెంకమ్మ, పార్వతి, సుమయ్య, అనురాధ, వరలక్ష్మి నివాళులర్పించారు.

యుటిఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా టీచర్ల ప్రతిభ



మెడల్, ప్రశంసాపత్రం అందుకుంటున్న టీచర్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా అక్టోబర్ 4, 5, 6 తేదీల్లో గుంటూరు నగరంలోని ఎన్‌టిఆర్ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో భాగంగా 45 ఏళ్ల మహిళా టీచర్ల విభాగంలో చదరంగం పోటీలో మండలానికి చెందిన పి.సీతామహాలక్ష్మి విజేతగా నిలిచారు. 40 ఏళ్ల లోపు విభాగంలో చదరంగం పోటీలో ఎస్.సబీహాభాను ద్వితీయ స్థానం సాధించినారని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ తెలిపారు. వంద మీటర్ల పరుగు పందెంలో జిసి.నరేష్‌కుమార్ తృతీయ స్థానం, 400 మీటర్ల నడక విభాగంలో కె.శరణుముఖేంద్ర ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. విజేతలకు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఖలందర్, ప్రచురణల కమిటీ ఛైర్మన్ హనుమంతరావు, ఐక్య ఉపాధ్యాయ ప్రధాన సంపాదకులు కుమార్‌రాజా సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జిసి.నరేష్ కుమార్, మున్సిపల్ సబ్ కమిటీ కన్వీనర్ బిల్లే రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్' తనిఖీ

చెన్నేకొత్తపల్లి : గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ సాల్వియా సాల్మన్ ప్రజలకు సూచించారు. మండలంలోని కనుముక్కల సచివాలయం-2 పరిధిలో ఉన్న ఓబుళంపల్లి గ్రామంలో శనివారం డిడిఒ డాక్టర్ సరిత ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్(ఎఫ్‌డిసి) ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమాన్ని డిప్యూటీ డిఎంహెచ్ఒ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. గ్రామంలో పరిసరాల పరిశుభ్రత, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. జ్వరం వచ్చిన వెంటనే ఆసుపత్రికి వెళ్లి వైద్యుల సూచన మేరకు మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ వెంకటనారాయణ, సిహెచ్ఒ సౌందర్య, ఎంపిహెచ్ఎ శ్రీనివాసులు ఎఎన్ఎం సుభాషిని, 104 సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలతో పనిచేయించడం నేరం

పుట్టపర్తి రూరల్ : 14 ఏళ్ల లోపు బాల, బాలికలను పనిలో చేర్చుకొని వారితో పనులు చేయించడం నేరమని ఐసిడిఎస్ అధికారులు సూచించారు. జిల్లా ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు శనివారం ఐసిడిఎస్ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు జిల్లా వ్యాప్తంగా పలు పట్టణాల్లో మోటార్, టూ వీలర్ మెకానిక్, గుజిరి షాపులు, హోటళ్లు, తదితర ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించారు. మైనర్లను పనిలో పెట్టుకోవడం, వారి హక్కులకు భంగం కలిగించడం నేరమన్నారు. షాపుల యజమానులకు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించారు.

వ్యాధినిరోధక టీకాలపై అవగాహన

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి పిహెచ్‌సి వైద్య సిబ్బంది శనివారం ప్రశాంతి గ్రామంలో గర్భిణులు, చిన్న పిల్లలకు వేసే వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. గర్భిణులకు జాగ్రత్తలను వివరించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించి, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. కార్యక్ర మంలో సామజిక ఆరోగ్య అధికారి నగేష్, ఎంపిహెచ్ఈఓ గఫూర్, ఆరోగ్య కార్యకర్త అమృత, ఆశా కార్యకర్త అనిత పాల్గొన్నారు.

పంట నమోదు, ఈకేవైసీ తప్పనిసరి : ఆర్డీవో

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పంట నమోదు, ఈకేవైసి చేయించుకున్న రైతులు మాత్రమే ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారని ఆర్డీవో మహేష్ స్పష్టం చేశారు. సికె.పల్లి, రామగిరి మండలాల్లో చేపట్టిన పంట నమోదు ప్రక్రియను శనివారం ఆర్డీవో తనిఖీ చేశారు. ఆయన సాగు చేసిన పంట విస్తీర్ణం, నీటి పారుదల, తదితర అంశాలను పరిశీలించారు. పంట నమోదు చేసుకున్న రైతు లందరూ ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని సూచించారు. ఆర్డీవో వెంట ఎడిఎ నరేంద్ర, వ్యవసాయ అధికారి ముస్తఫా, విఎఎలు త్రినాథ్, శ్రీనివాసులు, రాధాకృష్ణ, రైతులు ఉన్నారు.

మడకశిరకు పది మద్యం షాపులు

ప్రజాశక్తి-మడకశిర

నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు రాష్ట్ర ప్రభుత్వం 10 మద్యం షాపులు కేటాయించినట్లు ఎక్సైజ్ సిఐ ప్రసాద్‌రావు తెలిపారు. మడకశిర మండలంలో 4, రొళ్ల-1, అమరాపురం-2, అగళి-1, గుడిబండ మండలంలో 2 షాపులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రూ. 2 లక్షలు ఆన్‌లైన్ ద్వారా గానీ చలానా రూపంలో ద్వారా గాని డిడి ద్వారా జమ చేయాలన్నారు. దరఖాస్తు రుసుము రూ. 2 లక్షలు తిరిగి చెల్లింపు జరగదన్నారు. ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. దరఖాస్తులను 9వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు అందజేయాలన్నారు. 11వ తేదీ ఉదయం 8 గంటలకు కలెక్టర్ సమక్షంలో లాటరీ తీస్తారన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మండలంలోని తులసీదామ వృద్ధాశ్రమంలో ఉపాధ్యాయులు హరేసముద్రం అమల, రామకృష్ణ దంపతుల కుమార్తె హర్షితకృష్ణ జన్మదినం సందర్భంగా శనివారం వృద్ధులకు అన్నదానం చేశారు. వృద్ధులు హర్షం వ్యక్తం చేస్తూ హర్షితకృష్ణను దీవించారు.

కొత్త సీసాలో పాత సారా



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన 'కొత్త సీసాలో పాత సారా' చందంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతిపక్షంలో ఉండగా అన్నీ సమస్యలుగానే కనిపిస్తాయి. అధికారంలోకి వస్తూనే ఆ సమస్యలు సమస్యలుగా కాకుండా కొత్త పద్ధతుల్లో పాత విధానాలే అమలుకు నోచుకుంటూ ఉండటం పరిపాటి. ప్రభుత్వం మారితే విధానం మారుతుందని భావించి ఓటు వేసిన ఓటరుకు తిప్పలు మాత్రం మిగులుతూ ఉంటాయి. ప్రతిపక్షంలో ఉండగా టిడిపి మద్యంపై పెద్ద ఎత్తున విమర్శలు చేసింది. మద్యం ఏరులై పారిస్తోంది.. నాణ్యమైన మద్యం లేదంటూ ఆరోపించింది. అంతేకాకుండా వాటి ధరలపైనా విమర్శలు చేసింది. అధికారంలోకి వస్తూనే గాంధీ జయంతి రోజునే కొత్త విధానంలో మద్యం టెండర్లకు గెజిట్‌ను జారీ చేసింది. ఈ నెల 11వ తేదీ టెండర్లు కూడా ఆహ్వానించారు. ఈ ప్రక్రియను పరిశీలిస్తే ప్రభుత్వం మద్యం ద్వారా పెద్దఎత్తున ఆదాయం రాబట్టే ఆలోచనలో ఉన్నట్టు కనిపిస్తుంది. అనంతపురం జిల్లాలో 136 మద్యం దుకాణాలు, సత్యసాయి జిల్లాలో 87 మద్యం దుకాణాలకు టెండర్లు పలిచారు. ఒక్కో దరఖాస్తుకు నాన్ రిఫండబుల్ మొత్తాన్నిరూ. 2 లక్షలుగా కేటాయించడమే కాకుండా టెండర్ దక్కిన వారు రూ. 50 లక్షల నుంచి రూ. 80 లక్షల మొత్తాన్ని ప్రభుత్వానికి ముందుగానే చెల్లించాలి. దీని ద్వారా ప్రభుత్వానికి ఎంత పెద్దఎత్తున ఆదాయం సమకూరనుందన్నది ఆసక్తికరంగా మారింది. ఈ వారంలో దరఖాస్తులు చేసుకునేందుకు చాలా మంది సిద్ధమవుతున్నారు. అందులో అధికారపార్టీ ప్రజాప్రతినిధులే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. వారు తమ ప్రాంతంలో మద్యం వ్యాపారాన్ని తమ చేతుల్లో పెట్టుకుని ఆదాయం సమకూర్చుకునే ఆలోచనలో ఉన్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే పోటీదారులకు అటువంటి సంకేతాలు పంపిస్తుండటం గమనార్హం. దీని ద్వారా ఒక్క అనంతపురం జిల్లాలోనే మద్యం వ్యాపారం ఏడాదికి రూ. 500 కోట్ల మేరకు జరిగే అవకాశాలున్నాయి. గతంలో ఇదే స్థాయిలో మద్యం విక్రయాలు జరిగాయి. ఇకపోతే మద్యం ధరలపైనా మద్యం ప్రియుల్లో పెద్దగా సంతృప్తి లేనట్లు తెలుస్తోంది. పాత ధరలకు కొద్దిగా అటుఇటుగానే ధరలు ఉండే అవకాశాలున్నాయని వాపోతున్నారు. ఇసుక విషయంలోనూ ప్రభుత్వ తీరు అదే రకంగా ఉందన్న విమర్శ ఉంది. ఉచిత ఇసుక అని పేరు పెట్టినప్పటికీ రవాణా, సీనరేజీ ఛార్జీలు అన్నీ కలిపి చూస్తే గతం కంటే నామ మాత్రపు వ్యత్యాసం మాత్రమే ఉంది. అంతేకాకుండా దోపిడీ యథావిధిగా కొనసాగుతోంది. అయితే నేతలు మాత్రమే మారారు. ప్రభుత్వం దోపిడీని ఆపుతామని ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో మాత్రం కొనసాగుతూనే ఉంది. సామానుల్లో మాత్రం మద్యం, ఇసుక విషయంలో గతానికి ఇప్పటికీ పెద్ద తేడా లేదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇక ఈ వారంలో వర్షాలు కురుస్తున్నాయి. సెప్టెంబర్ నెలలో వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉండగా అక్టోబర్ మొదటి నుంచి వర్షాలు జిల్లా వ్యాప్తంగా కురుస్తున్నాయి. ఒకవైపు రబీ సీజన్ ప్రారంభంలోనే పడుతున్నాయి. ఖరీఫ్‌లో ఒక నెల బాగా పడితే మరో నెల వర్షాభావంతో పంటలు పెద్దగా రాలేదు. అయితే రబీ ప్రారంభంలో రావడం సాగుకు కొంత ఆశాజనంగానే ఉందని చెప్పాలి. ప్రభుత్వం సబ్సిడీ పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేపట్టింది.